
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

గురువారం 31 అక్టోబరు 2024

వెలుగుల పండుగకు సర్వం సిద్ధం

నేతల దీపావళి శుభాకాంక్షలు





స్థానిక టి.నగర్ రంగనాథన్ వీధిలో కొనుగోలుదారుల రద్దీ

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు రాష్ట్ర ప్రజలంతా సన్నాహాలు చేసుకుంటున్నారు. టపాసులు, మిఠాయిలు, కొత్త వస్త్రాలు కొనుగోలు కోసం రావడంతో మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం అనుమతించిన ప్రాంతాల్లో టపాసుల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ సంవత్సరం టపాకాయల ధర పెరిగినప్పటికీ, నరక చతుర్థి రోజున కాల్చాలనే కోరికతో ధరల గురించి ఆలోచించకుండా ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. కాగా, బుధవారం మధ్యాహ్నం 12 నుంచి దాదాపు గంటన్నరపాటు భారీగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది. ముఖ్యంగా టపాసులు విక్రయిస్తున్న మెరీనా బీచ్ సమీపంలోని ఐల్యాండ్ గ్రౌండ్‌లో నీరు చేరింది. అలాగే, ప్యారీస్, టి.నగర్, మైలాపూర్ తదితర ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో అమ్మకాలు మందకొడిగా సాగాయని వ్యాపారులు ఏకరువు పెడుతున్నారు. ఏదేమైనప్పటికీ పూజా ద్రవ్యాల సామాగ్రికి గిరాకి పెరిగింది. పూలు, పండ్లు, పూజలు, నోములకు కావలసిన వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి.

సుఖశాంతులు వెల్లివిరియాలి...

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజల్లో కష్టాలు తొలిగి సుఖాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ పలు రాజకీయ పార్టీల నేతలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, అన్నాడీఎంకే నాయకురాలు వీకే శశికళ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై తదితరులు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. తియ్యదనం పంచే దీపావళి రోజు అందరి జీవితాల్లో కష్టాలు తొలిగి సంతోషం వెల్లివిరియాలని కోరారు.

గంటపాటు కుండపోత

- అన్నానగర్‌లో 9 సెం.మీ.ల వర్షం
- కొద్దిపాటి వర్షానికే కొన్ని ప్రాంతాలు జలమయం



కుండపోత వర్షానికి జలమయమైన కీల్పాక్ ప్రాంతం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో రెండు రోజులపాటు ఎండవేడితో అవస్థలు పడిన నగరవాసులు బుధవారం ఉదయం హఠాత్తుగా కురిసిన కుండపోత వర్షానికి ఊరట చెందారు. ఈ వర్షానికి నగరమంతటా చల్లటివాతావరణం నెలకొంది. అయితే కుండపోత వర్షంతో టి.నగర్, నుంగంబాక్కం వంటి ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. బుధవారం ఉదయం 8 నుండి 12 గంటల వరకు భానుడు భగ్గుమన్నాడు. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. సన్నటి జల్లులతో ప్రారంభమైన వర్షం కుండపోతగా మారింది. మనలి, తిరువొత్తియూరు, తండయార్‌పేట, వాషర్‌మెన్‌పేట, రాయపురం, మింట్, ప్యారీస్ కార్నర్, ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూరు, నుంగంబాక్కం, అంబత్తూరు, విల్లివాక్కం, పాడి, కొరట్టూరు, అన్నానగర్, మధురవాయల్, కోయంబేడు, వల



అన్నా ఫ్లైఓవర్‌పై వానలో తడుస్తూ సైకిలుపై వెళుతున్న బాలురు

సరవాక్కం పూందమల్లి, తాంబరం, గిండి, నుంగంబాక్కం, రెడ్‌హిల్స్, సైదాపేట తదితర ప్రాంతాల్లో గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అన్నానగర్ ప్రాంతంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు 9 సెం.మీ.ల వర్షపాతం నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే విధంగా మనలి, కొళత్తూరు, పెరంబూరు, అమింజికరై, మధురవాయల్ ప్రాంతాల్లో 6 సెం.మీ.ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

15 జిల్లాలకు వర్షసూచన..

మన్నార్ జలసంధి ప్రాంతం, పడమటి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం 15 జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దిండుగల్, మదురై, తిరుచ్చి, కరూరు, నామక్కల్, సేలం, ఈరోడ్, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, వేలూరు, తిరువణ్ణామలై, కళ్ళకురిచ్చి, అరియలూరు తదితర జిల్లాల్లో పలు చోట్ల వర్షం కురుస్తుందని తెలిపారు. చెన్నై నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.



పసుంపొన్ గ్రామంలో దేవర్ స్మారకస్థలంలో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



పసుంపొన్‌లో ముత్తురామలింగ దేవర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ఘనంగా పసుంపొన్ దేవర్ జయంతి వేడుకలు

- స్టాలిన్, ఈపీఎస్ సహా పలువురు నేతల నివాళి

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పసుంపొన్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అనుచరుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 117వ జయంతి వేడుకలు, 62వ గురుపూజోత్సవం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రులు దేవర్ స్మారక స్థలం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయనతోపాటు రాష్ట్ర మంత్రులు పెరియసామి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, కేఆర్ పెరియకరుప్పన్, గీతాజీవన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఎ.చక్రపాణి, పి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, అన్బిల్ మహేష్, టీఆర్బీ రాజా, ఎంపీ కే నవాస్‌ఘనీ, శాసనసభ్యులు కాదర్ బాషా ముత్తురామలింగం, ఎస్.మురుగేశన్, ఇరామ కరుమాణిక్కం, జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ కాలోన్ తదితరులు నివాళులర్పించారు. ఆ తర్వాత మదురై గోరిపాళయంలో ఉన్న దేవర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ ప్రాంతానికి చేరువగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ కీర్తిని ఇనుమడించేలా డీఎంకే ప్రభుత్వం మదురై నగరంలో భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, పసుంపొన్ గ్రామంలో స్మారకాలయం నిర్మించిందని, దేవర్ పేరుతో మేల్‌నీలిత్తనల్లూరు, కముది, ఉసిలంపట్టి ప్రాంతాల్లో మూడు ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. మదురై ఆండాళ్‌పురం వద్దనున్న ఫ్లైఓవర్‌కు దేవర్ వంతెన అనే పేరుపెట్టామని, కారైక్కుడి అళగప్పా విశ్వవిద్యాలయంలో దేవర్ పేరుతో ప్రత్యేక విద్యాపీఠం నెలకొల్పామని చెప్పారు తమిళజాలర్లపై శ్రీలంక నావికాదాడులు కొనసాగిస్తుండటం పట్ల విలేఖరుల అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమిళ జాలర్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటూ ఢిల్లీలో ప్రధానిని కలిసిన ప్రతీసారి కోరుతూనే ఉన్నానని, విదేశీ మంత్రిత్వ శాఖకు పలుమార్లు లేఖలు కూడా రాశానన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమిళ జాలర్ల ప్రాణాలకు ముప్పువాటిల్లకుండా, వారిపై దాడులు జరుగకుండా అడ్డుకోవాలని తాను డిమాండ్ చేసినట్టు చెప్పారు.

ఈపీఎస్ నివాళి..

అన్నాడీఎంకే తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దేవర స్మారక స్థలంలో స్వర్ణకవచం ధరించి ఉన్న దేవర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు మాజీ మంత్రులు సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్, విజయభాస్కర్, దిండుగల్ శ్రీనివాసన్ దేవర్ స్మారక స్థలం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ సందర్భంగా ఈపీఎస్ మడియా తో మాట్లాడుతూ దేవర్ జయంతి వేడుకలు ప్రభుత్వ వేడుకలుగా జరుపుకునేలా ఉత్తర్వు జారీ చేసిన ఘనత మునుపటి అన్నాడీఎంకే ప్రభుత్వానికే దక్కుతుదన్నారు. దేవర్ దానశీలి అని 1952లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి, తనకున్న ప్రజాదరణను రుజువుచేసుకున్నారని తెలిపారు. దేవర్ జీవితం భావితరాలకు ఆదర్శమని ఈపీఎస్ అన్నారు.

రాజధాని నగరంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాజధాని నగరం చెన్నైలో స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 117వ జయంతి వేడుకలకు ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా నందనం జంక్షన్‌లోని దేవర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి మంత్రులు అధికారులు నివాళులర్పించారు. మంత్రులు రఘుపతి, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు టీఆర్ బాలు, తమిళచ్చి తంగపాండ్యన్, గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్ ప్రియ, శాసనసభ్యులు డి.వేలు, ఏఎంవీ ప్రభాకరరాజా, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి వి. రాజారామన్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ పూచ్చి ఎస్ మురుగన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.



పసుంపొన్‌కు నివాళులర్పిస్తున్న సెల్వ పెరుందగై

కాంగ్రెస్‌లో రచ్చ!

- అధికారంలో భాగస్వామ్యంపై కార్యకర్తల నినాదాలు
- సెల్వపెరుంతగై ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో భాగస్వామ్యం కావాలంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుంతగై సమక్షంలో పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీనికి ఇది అనువైన సమయం కాదంటూ సెల్వపెరుంతగై వారిస్తున్నా డీఎంకే ప్రభుత్వంలో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం ఉండాలని పట్టుబట్టారు. తేనాంపేట కామరాజర్ అరంగంలో టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో సెంట్రల్ చెన్నై జిల్లా శాఖ అధ్యక్షుడు ముత్తళగన్ నాయకత్వంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు సెల్వపెరుంతగై ముఖ్య అతిథిగా హాజరై పార్టీలోని వివిధ విభాగాల నేతలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తుళగన్ మాట్లాడుతూ... డీఎంకే అధికారంలో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం కల్పించి ఉంటే ప్రజా సమస్యలను చక్కగా పరిష్కరించేవాళ్లమని, ఇంటి పన్ను రూ.3వేల నుంచి రూ.30 వేలకు పెంచటంతో ఆ విషయమై ప్రజలు తమను నిలదీస్తుంటే బదులు చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంకేలో యూనియన్ నాయకుడికి కూడా కనీసపక్షంగా కౌన్సిలర్ పదవి లభిస్తుందని, అయితే కాంగ్రెస్‌లో ఎవరికి ఎలాంటి పదవులు లేవన్నారు. ఇదే విధంగా సమావేశంలో ప్రసంగించిన మరి కొంతమంది నేతలు కూడా అధికారంలో భాగస్వామ్యం పొందాలని డిమాండ్ చేశారు. చివరగా సెల్వపెరుంతగై మాట్లాడుతూ.. దీపావళి వేడుకల్లో అధికారంలో భాగస్వామ్యం కావాలంటూ నినాదాలు చేయడం సబబు కాదని మందలించారు. ఈవిషయంపై పార్టీ అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందని, అంతవరకూ పార్టీ శ్రేణులంతా సహనం పాటించాలని హెచ్చరించారు. ఇదిలా వుండగా బుధవారం సెల్వపెరుంతగై, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తిరునావుక్కరసు తదితరులు రామనాథపురం జిల్లా పసుంపొన్‌లో వున్న ముత్తురామలింగ దేవర్‌కు నివాళులర్పించారు.



క్రోంపేట-తాంబరం మధ్య స్తంభించిన ట్రాఫిక్

కిక్కిరిసిన రవాణా కేంద్రాలు

- కిటకిటలాడిన వీధులు
- బస్, రైల్వేస్టేషన్లలో విపరీతంగా పెరిగిన రద్దీ

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి రద్దీతో రాష్ట్ర వ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రవాణా కేంద్రాలు జనంతో క్రిక్కిరిసిపోయాయి. ఆఖరికి విమానాశ్రయాలు సైతం మార్కెట్లను తలపించేలా కిటకిటలాడుతూ కనిపించాయి. రాష్ట్రంలో దీపావళి పండుగను గురువారం జరుపుకుంటున్నప్పటికీ, సొంతూళ్లకు వెళ్లిన ప్రజల కోరిక మేరకు శుక్రవారం కూడా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అందువల్ల శని, ఆదివారాలతో కలిసి వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు.. దీంతో బస్, రైల్వేస్టేషన్లలో సాధారణ రోజుల కంటే రద్దీ బాగా పెరిగింది. తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ ఆధ్వర్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని 14 వేల ప్రత్యేక బస్సులను మంగళవారం నుంచి నడుపుతున్నారు. అదే విధంగా చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం, పెరంబూర్ తదితర రైల్వేస్టేషన్ల నుంచి బయల్దేరుతున్న రైళ్లలో ఆర్డినరీ బోగీల్లో ఎక్కేందుకు ప్రయాణికులు పోటీపడుతున్నారు. మంగళవారం రాత్రి దాదాపు లక్ష మందికి పైగా సొంతూళ్లకు పయనమైన నేపథ్యంలో, బుధవారం సుమారు 2.5 లక్షల నుంచి 4 లక్షల మందికి పైగా బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలు, ఆమ్నీ బస్సుల్లో వెళ్లినట్లు తెలుస్తోంది. పండుగ రోజు ఉదయానికల్లా సొంతూళ్లలో ఉండాలన్న కోరికతో బుధవారం ఉదయం కూడా బస్, రైల్వేస్టేషన్లు ప్రజలతో కిటకిటలాడాయి.

48వేల మంది పోలీసులతో భద్రత

దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం భద్రత కట్టుదిట్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 48వేల మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసింది.. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా, ట్రాఫిక్ రద్దీ నియంత్రించే దిశగా చర్యలు చేపట్టినట్లు పోలీసు శాఖ తెలిపింది.



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో రద్దీ

ఉళుందూర్‌పేటలో రూ. కోట్లలో గొర్రెల విక్రయం...

కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సంతలో బుధవారం తెల్లవారుజాము నుంచి రూ.5 కోట్లకు పైగా గొర్రెల విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. 4 నుంచి 6 గంటల వరకు ఈ పశువుల సంతలో గొర్రెలు కొనుగోలు చేసేందుకు ప్రజలు, వ్యాపారులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఈ దీపావళికి గొర్రెల విక్రయాలు తృప్తికరంగా ఉన్నట్లు రైతులు తెలిపారు.

సమాచార దర్శిని

28న పింఛన్‌దారుల గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారుల గ్రీవెన్స్ నవంబరు 28వ తేది జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో, స్థానిక హార్బర్ సమీపంలో ఉదయం 10.30 గంటలకు గ్రీవెన్స్ జరుగనుంది. ప్రభుత్వ పింఛన్‌దారులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను నవంబరు 15వ తేదిలోపు కలెక్టర్ కార్యాలయంలో అందజేసి పరిష్కారం పొందవచ్చని కలెక్టరేట్ తెలిపింది.

నేడు తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లు గురువారం తక్కువ సంఖ్యలో నడుపనున్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినంగా కావడంతో ఆ రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రవాణా శాఖలో 2,877 పోస్టుల భర్తీకి అనుమతి

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా శాఖలో 2,877 ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. డ్రైవర్, కండక్టర్ సహా 2,340 టీసీసీ ఉద్యోగుల నియామకాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ప్రకారం, 377 మంది టీటీసీ, 462 టెక్నికల్ స్టాఫ్ మొత్తం 769 పోస్టులు ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి కేటాయించారు.

కండలేరు నుంచి నీరు విడుదల

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు తాగునీటి అవసరార్థం ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి 1,460 ఘనపుటడుగుల జలాలను విడుదల చేస్తున్నారు. కృష్ణా జలాల ఒప్పందంలో భాగంగా కండలేరు డ్యాం నుంచి గత నెల 19వ తేది నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో, పదిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్న కారణంగా జలాశయాలకు ప్రవాహం పెరగడంతో కండలేరు నుంచి విడుదల చేస్తున్న నీటిని తగ్గించారు. అనంతరం వర్షాలు తగ్గడంతో ఈ నెల 23వ తేది కండలేరు నుంచి విడుదల చేస్తున్న 140 ఘనపుటడుగుల జలాలను క్రమక్రమంగా 1,460 ఘనపుటడుగులకు పెంచారు. జలాల విడుదల పెంపుతో రాష్ట్ర సరిహద్దు ఊత్తుకోట జీరో పాయింట్‌కు 365.24 ఘనపుటడుగల జలాలు వచ్చి చేరుతున్నాయని అధికారులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటి రాక తగ్గింది. మంగళవారం డ్యాంకు 14,273 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, బుధవారం ఉదయం 10,568 ఘనపుటడుగులకు తగ్గింది. డెల్టా జిల్లాల సాగు కోసం డ్యాం నుంచి 12,600 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 108.55 అడుగులతో 76.29 అడుగుల నీటిమట్టాలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

'కబీర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మత, వర్గ సామరస్యానికి కృషిచేసిన వారికి ముఖ్యమంత్రి ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'కబీర్' పురస్కారాలు అందజేస్తుంటారు. రాష్ట్రంలో నివసిస్తున్న భారత పౌరులందరూ (సాయుధ బలగాలు, పోలీసుల, అగ్నిమాపక శాఖ, ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక సామరస్య కార్యకలాపాలు వారి ప్రభుత్వ ఉద్యోగ విధుల్లో భాగమైనప్పుడు మినహా) ఈ అవార్డుకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు తాము చేసిన కార్యక్రమాల వివరాలతో కూడిన దరఖాస్తులను https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 15వ తేదిలోపు పంపించాలని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

11న పోలీసు వాహనాల వేలం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆవడి పోలీస్ కార్యాలయ పరిధిలోని సాయుధదళ మైదానంలో పాత వాహనాలను నవంబరు 11వ తేది వేలం వేయనున్నారు. మొత్తం 23 వాహనాలను ఆవడి అదనపు పోలీస్ కమిషనర్ నేతృత్వంలో 11వ తేది ఉదయం 9 గంటలకు వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనేవారు నవంబరు 1 నుంచి 5వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలకు ఆయుధదళ మోటారు వాహన విభాగం కార్యాలయంలో పేరు నమోదుచేసుకోవాలి. ఆధార్ కార్డు, జీఎస్టీ నెంబరుతో సర్టిఫికెట్‌తో పాటు నాలుగు చక్రాల వాహనాలకు రూ.5 వేలు, ద్విచక్రవాహనాలకు రూ.2 వేలు డిపాజిట్‌గా చెల్లించాలి. వేలంలో వాహనాలు కొనుగోలు చేసినవారు అప్పుడే 75 శాతం సొమ్ము చెల్లించాలని ఆవడి పోలీస్ కమిషనరేట్ తెలియజేసింది.

పొదుపు ఖాతాలు ప్రారంభించండి

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల నుంచి పెద్దల వరకు అందరూ పొదుపు ఖాతాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. పొదుపు ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి ఏటా అక్టోబరు 30వ తేది 'ప్రపంచ పొదుపు దినోత్సవం' జరుపుకుంటారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో.. పోస్టాఫీసుల ద్వారా అమలుచేస్తున్న చిన్న మొత్తాల పొదుపు పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయి. ఇవి కుటుంబ అవసరాలు, ఊహించని ఖర్చులు తీర్చడానికి ఉపయోగపడతాయి. 'చిన్న మొత్తాలే భవిష్యత్తుకు బాటలు' అనే నినాదానికి అనుగుణంగా పాఠశాల విద్యార్థుల నుంచి పెద్దల వరకు అందరూ పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతా ప్రారంభించాలంటూ సీఎం ట్వీట్ చేశారు.

సమయపురం కొలనులో రెండు మృతదేహాలు లభ్యం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా సమయపురం మారియమ్మన్ ఆలయ కొలనులో గుర్తు తెలియని రెండు మృత దేహాలను పోలీసులు కనుగొన్నారు. మారియమ్మన్ ఆలయానికి 800 మీటర్ల దూరంలో ఉన్న ఆ కొలను లోతు అధికంగా ఉండటం భక్తులెవరినీ స్నానానికి అనుమతించరు. పండుగ రోజుల్లో ఆ కొలను నుండే భక్తులు క్షీరకలశాలను శిరస్సులపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లటం ఆనవాయితీ. ప్రతియేటా ఆ కొలనులో తెప్పోత్సవం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆ కొలనులో గుర్తు తెలియని ఓ వ్యక్తి శవం తేలుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో వెళ్లి ఆ కొలను నుంచి 40 యేళ్ల వ్యక్తి శవాన్ని వెలికి తీశారు. అదే సమయంలో కొలనులో ఇంకో చోట మరో శవంగా కూడా ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. నిక్కరు మాత్రమే ధరించిన ఆ వ్యక్తి శవాన్ని కూడా వెలికి తీశారు. ఆ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీరంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కొలనులో నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అరక్కోణం వద్ద సిగ్నళ్ల లోపం

ఆలస్యంగా నడిచిన రైళ్లు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం రైల్వేస్టేషన్‌లోని మూడు, నాలుగు ప్లాట్‌ఫామ్‌లలో చెన్నై వెళ్లే మార్గంలో సిగ్నల్స్‌లో బుధవారం సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో రైళ్లన్నీ ఆలస్యంగా నడిచాయి. ఈ సిగ్నల్స్ లోపం వల్ల ఉదయం ఆరుగంటలకు తిరుత్తణి నుంచి చెన్నై వెళ్ళాల్సిన రైలు సహా మూడు రైళ్లు నిలిచిపోయాయి. దీంతో చెన్నై వెళ్ళాల్సిన ప్రయాణికులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్ మాస్టర్‌ను ముట్టడించారు. ఈ విషయమై ప్రయాణికులు మాట్లాడుతూ అరక్కోణం రైల్వేస్టేషన్ కేబిన్ సిబ్బంది సక్రమంగా సిగ్నల్స్ ఇవ్వడం లేదని, వారి నిర్లక్ష్యం వల్లే చెన్నై నుంచి అరక్కోణం వచ్చేరైళ్లు పది కిలోమీటర్ల ముందే నిలిసేసి గంట తర్వాత సిగ్నల్ ఇవ్వటం ఆనవాయితీగా మారిందన్నారు. ఇదే విధంగా ఉదయం పూట చెన్నై వైపు వెళ్లే రైళ్లు కూడా సిగ్నల్స్ సకాలంలో లభించక ఆలస్యంగా చేరుతున్నాయని, దీంతో చెన్నై చేరుకునే ఉద్యోగులు, వ్యాపారులు సకాలంలో తమ రోజువారీ కార్యకలాపాలను ప్రారంభించలేకపోతున్నారు. ఈ విషయమై రైల్వేశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

ప్రజా సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం

● వీకే శశికళ

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు, అన్నాడీఎంకే నేత వీకే శశికళ ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు పసుమ్‌పొన్ ముత్తురామలింగ దేవర్ 117వ జయంతి, 62వ గురుపూజను పురస్కరించుకొని వీకే శశికళ బుధవారం ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఏ ప్రాంతంలోను పూడికతీత జరుపలేదని, అందువల్ల మోస్తరు వర్షాలకే నివాస ప్రాంతాలు వరద ముంపుకు గురై ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని ఆరోపించారు. ప్రముఖ నటుడు విజయ్ టీవీకే పేరుతో పార్టీని ప్రారంభించడం ప్రజాస్వామ్య హక్కు అని, అయితే ఎవరూ అధికారంలోకి రావాలన్న ప్రజలే నిర్ణయిస్తారని శశికళ అభిప్రాయపడ్డారు.

అన్నా వర్సిటీ మాజీ వీసీపై అక్రమాస్తుల ఫిర్యాదు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ కాళిరాజు అక్రమాస్తులపై ఆరు నెలల్లో విచారణ పూర్తిచేయాలని మద్రాసు హైకోర్టు ఏసీబీని ఆదేశించింది.2012 నుంచి 2013, 2019 నుంచి 2022 వరకు అన్నా వర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా కాళిరాజు పనిచేశారు.ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారని అదే వర్సిటీకి చెందిన మాణిక్యం గత జూలైలో ఏసీబీకి ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ మాణిక్యం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. బుధవారం న్యాయమూర్తి శేషసాయి సమక్షంలో ఈ పిటిషన్ విచారణకు రాగా, ఏసీబీ తరపు న్యాయవాది హాజరై.. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరిపినట్లు తెలిపారు. ఈ వాదనలు అంగీకరించిన న్యాయమూర్తి, ఆరు నెలల్లో విచారణ పూర్తిచేసి నివేదిక దాఖలుచేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు.

క్రీడా పోటీ విజేతలకు అభినందన

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని మహావీర్ దయానికేతన్ జైన్ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 17 నుంచి 22వ తేది వరకు జార్జియాలో అంతర్జాతీయ పోటీలు జరిగాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 22 మంది పాల్గొన్నారు. మినిస్టర్ ఆఫ్ యూత్ అఫ్రోచ్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన పోటీల్లో తమిళనాడు తరపున మాస్టర్ ఆర్.అనీష్‌రాజ్ పాల్గొని రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి దేశానికి, పాఠశాలకు ఘనత చేకూర్చారు. జైన్ పాఠశాల కార్యదర్శి రాజేష్‌కుమార్ జైన్ బుధవారం విద్యార్థిని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, పాఠశాల విద్య అడ్వయిజర్ సీతారామన్ తదితరులు విద్యార్థిని అభినందించారు.




విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

5 నుంచి గ్రాండ్ చెస్ మాస్టర్ టోర్నీ

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5వ తేదీ నుంచి నగరంలో గ్రాండ్ చెస్ మాస్టర్ పోటీలు జరుగనున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర యూత్ వెల్ఫేర్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సెక్రటరీ అతుల్య మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తొలిసారి గత యేడాది గ్రాండ్ చెస్ మాస్టర్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో డిగుహేష్ విజేతగా నిలిచారు. నగరంలో తొలిసారి జరిగిన గ్రాండ్ చెస్ పోటీలు అంతర్జాతీయ క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో కోట్టూరుపురంలో ఉన్న అన్నా గ్రంథాలయ ప్రాంగణంలో నవంబరు 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీలు మొత్త ఏడు రౌండ్లలో జరుగనున్నాయి. ఇందులో స్వదేశీ, విదేశీ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.50 లక్షల నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే, ఈ పోటీలతో పాటు గ్రాండ్ మాస్టర్స్ ఛాలెంజర్స్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచేవారికి రూ.20 లక్షల బహుమతి అందజేస్తామని అతుల్య మిశ్రా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కవరపేట సహా రైలుమార్గాల్లో 24 గంటల పర్యవేక్షణ

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా అసాంఘిక శక్తుల ఆగడాలు అడ్డుకొనేలా ఆర్పీఎఫ్ పోలీసులు 24 గంటల పర్యవేక్షించనున్నారు. కవరపేట రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం సహా పెరంబూర్, అంబత్తూర్, అరక్కోణం, సెంట్రల్, కొరుక్కుపేట, పొన్నేరి తదితర రైల్వేస్టేషన్లలో ఉన్న లూప్ లైన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని 5 నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

విజయ్ అభిమానుల్లో 50 శాతం మంది మా వైపే : సీమాన్

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, సినీ నటుడు విజయ్ అభిమానులు, ఆ పార్టీ కార్యకర్తల్లో సుమారు 50 శాతం మంది తమ పార్టీకే ఓటు వేస్తారని నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) నేత, సినీ దర్శకుడు సీమాన్ అన్నారు. తేని సమీపంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోకుండా పోటీ చేసిందని, 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. డీఎంకే దశాబ్దాలుగా ఒంటరిగా పోటీ చేయలేదని, త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే ఆ పార్టీ సత్తా ఏమిటో తెలుస్తుందని చెప్పారు. విజయ్ తన పార్టీ మహానాడులో గెలిస్తే మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. విజయ్ అభిమానులలో చాలామంది తమ పార్టీ కార్యకర్తలుగా ఉన్నారని సీమాన్ తెలిపారు.

అంగన్వాడీ భవన నిర్మాణాల పరిశీలన

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు డివిజన్ ఇలవమ్‌పాడి పంచాయతి ధార్‌వలి గ్రామంలో ఉన్న పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాలలో రూ.16.55 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్వాడీ భవన నిర్మాణాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వేండా, అసిస్టెంట్ పథక అధికారి యువరాజ్, బీడీఓలు పారి, ప్రేమలత తదితరులున్నారు.



భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

దుస్తుల పంపిణీ

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు నియోజకవర్గంలోని రేషన్ దుకాణాల్లో ఉచిత చీరలు, ధోవతులందించే కార్యక్రమం జరిగింది. డీఎంకే జిల్లా సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని, ప్రజలు ఉచిత దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, యూనియన్ కమిటీ అధ్యక్షులు వెంకటేశన్, కుమారపాండ్యన్, యూనియన్ కమిటీ పెరుం అధ్యక్షుడు భాస్కరన్, జిల్లా కౌన్సిలర్ కృష్ణమేనన్, పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

చెక్‌డ్యాం పరిశీలన

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి తాలూకా గుహైనల్లూరు గ్రామం సమీపంలోని చెక్ డ్యాంను బుధవారం సాయంత్రం మంత్రి దురైమురుగన్ పరిశీలించి పూలు చల్లారు. చెరువు మధ్య నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.12.70 కోట్ల తో నిర్మించిన చెక్ డ్యాం ఇటీవల కురిసిన వర్షాలకు నిండింది. దీంతో మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చెరువులో పూలు చల్లుతున్న మంత్రి దురైమురుగన్

7న మంత్రి సెంథిల్ బాలాజి కేసు విచారణ

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ఈడీ దాఖలుచేసిన మనీలాండరింగ్ కేసు విచారణ నవంబరు 7వ తేదీకి వాయిదావేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో బుధవారం మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ఈడీ దాఖలుచేసిన కేసు విచారణ న్యాయమూర్తి ఎస్.కార్తికేయన్ సమక్షంలో జరిగింది. మంత్రి విచారణకు హాజరయ్యారు. ఈడీ తరపు సాక్షిగా హాజరైన ఫోరెన్సిక్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మణివన్నన్‌ను సెంథిల్ బాలాజి తరపు న్యాయవాది క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఈ విచారణ పూర్తయిన నేపథ్యంలో, తదుపరి విచారణను నవంబరు 7వ తేదీకి వాయిదావేసిన న్యాయమూర్తి, ఆ రోజు మణివన్నన్ విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు.

మదురై ఆలయ పరిసరాల్లో టపాసులు కాల్చొద్దు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలయం చుట్టుపక్కల నివసించే వారు టపాసులు కాల్చరాదని మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ కుంభాభిషేకం 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, త్వరలో మీనాక్షి అమ్మవారి ఆలయ కుంభాభిషేకం జరుగనుంది. ఈ నేపథ్యంలో, మీనాక్షి అమ్మవారి ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు, గోపుర కలశాలకు రంగులు వేసే పనులు చేపట్టడంతో, గోపురం చుట్టూ గుడ్డ తెరలు ఏర్పాటు చేశారు. అందువల్ల ఆలయం చుట్టుపక్కల నివసించే వారు ఆలయ భద్రత దృష్ట్యా దీపావళి రోజున మంటలు చెలరేగేలా, ప్రమాదకరమైన టపాసులు పేల్చకుండా చూడాలని ఆలయ నిర్వాహకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తిరుచ్చిలో రూ.1.16 కోట్ల బంగారం స్వాధీనం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో రూ.1.16 కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్, కౌలాలంపూర్ తదితర విదేశాల నుంచి మంగళవారం రాత్రి తిరుచ్చికి వివిధ సంస్థలకు చెందిన విమాన సర్వీసులు వచ్చాయి. తిరుచ్చి ఎయిర్‌పోర్టులో దిగిన ప్రయాణికులతో పాటు వారి లగేజీలను కస్టమ్స్ అధికారులు నిశితంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.51.39 లక్షల విలువ చేసే అమెరికన్ డాలర్లు, రూ.1.16 కోట్ల విలువైన 1.488 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పలువురు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

ఖైదీలతో ములాఖత్ వ్యవహారం

న్యాయవాదుల కమిటీ ఏర్పాటు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జైలు ఖైదీలతో ములాఖత్‌కు వెళ్లే న్యాయవాదుల సంక్షేమార్థం మద్రాసు హైకోర్టు న్యాయవాద సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ జైళ్లలో బందీలుగా ఉన్న ఖైదీలతో న్యాయవాదులు ములాఖత్ అయ్యేందుకు విధించిన కొత్త నిబంధనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం సమక్షంలో బుధవారం మళ్లీ ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. అప్పుడు జైలు శాఖ డీజీపీ తరపున దాఖలుచేసిన నివేదికలో, ఖైదీలను కలిసే న్యాయవాదుల కోసం కొత్త నిబంధన పాటించనున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా న్యాయవాదులు సంబంధిత ఖైదీలను సులువుగా సంప్రదించి కేసు వివరాలు సేకరించవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా చెన్నై పుళల్ సెంట్రల్ జైలులో ప్రప్రథమంగా ఈ సదుపాయం అందుబాటులో ఉందని, రాష్ట్రంలోని మిగతా జైళ్లలో కూడా ఈ సేవలు విస్తరింపజేయనున్నట్లు జైలు శాఖ డీజీపీ హామీ ఇచ్చారు. మద్రాసు హైకోర్టు న్యాయవాదుల సంఘం తరపున హాజరైన సంఘ అధ్యక్షుడు జి.మోహన్‌కృష్ణన్ జైళ్లలో ఖైదీలను సంప్రదించేందుకు ఏర్పాటుచేసిన అద్దాల బోనులను ఇప్పటివరకు తొలగించలేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తుల బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. జైళ్లను పరిశీలించి న్యాయవాదుల కోసం కల్పించిన వసతుల వివరాలను నివేదికగా దాఖలుచేసేందుకు వీలుగా బార్ కౌన్సిల్, మద్రాసు హైకోర్టు న్యాయవాదుల సంఘం, లా అసోసియేషన్, మహిళా న్యాయవాదుల సంఘం, మద్రాసు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కూడిన కమిటీని నియమించిన బెంచ్, తదుపరి విచారణ నవంబరు 6వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిబంధనలు అతిక్రమించి టపాసులు కాల్చితే కేసులు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి టపాసులు కాల్చితే కేసులు నమోదుచేస్తామని పోలీసు శాఖ హెచ్చరించింది. గురువారం దీపావళి పండుగ సందర్భంగా ఉదయం 6 నుంచి 7 గంటలు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని కాలుష్య నియంత్రణ బోర్డు తెలియజేసింది. ఈ నేపథ్యంలో, బాణసంచా కాల్చడంపై ప్రజలు నిబంధనలు తప్పక పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు చేస్తామని పోలీసు శాఖ హెచ్చరించారు. ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటుచేసినట్లు పోలీసు శాఖ తెలియజేసింది.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీలో భారీగా నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరియలూరు జిల్లా తంజావూరనచావిడి గ్రామానికి చెందిన ప్రేమదాస్ (21) ఆన్‌లైన్ రమ్మీ ఆడుతుండేవాడు. ఈ ఆటలో ప్రేమదాస్ భారీగా నగదు కోల్పోయినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన ప్రేమదాస్ మంగళవారం రాత్రి తన గదిలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో చట్టం కింద కానిస్టేబుల్ అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోలీసును పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా కలక్కాడు గ్రామానికి చెందిన ఆనంద కలైసెల్వన్ జిల్లా ఆయుధదళంలో పనిచేస్తూ, పదిరోజుల క్రితం ఏర్వాడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. ఈ నేపథ్యంలో, ఆనంద కలైసెల్వన్ 17 ఏళ్ల ప్లస్ టూ విద్యార్థినికి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలి తల్లిదండ్రులు పాళయంకోట మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. విచారణలో... పాళయంకోటలోని ప్లస్ టూ చదువుతున్న విద్యార్థినిపై ఆనంకలైసెల్వన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు, ఆ విద్యార్థినిని అసభ్యంగా ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిపింది. ఈ వ్యవహారంలో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, ఆనంద కలైసెల్వన్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

● డ్రైవింగ్ లైసెన్స్‌కు లంచం..

ఆర్టీఏ అధికారికి మూడేళ్ల జైలు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.2 వేలు లంచం తీసుకున్న పూందమల్లిలోని ఆర్టీఏ కార్యాలయ అధికారి సహా ఇద్దరికి తలా మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరువళ్లూర్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆవడి కామరాజ్ నగర్‌కు చెందిన మురళి తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం పూందమల్లి ఆర్టీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. విధుల్లో ఉన్న గణపతికి బ్రోకర్ బాలాజీ ద్వారా రూ.2 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై మురళి అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. వారి సలహా మేరకు రసాయనం కలిపిన రూ.2 వేలు కరెన్సీని మురళి నుంచి అందుకుంటుండగా అధికారి గణపతిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తొమ్మిదేళ్లుగా విచారణ కొనసాగిన ఈ కేసు తీర్పును ప్రత్యేక న్యాయమూర్తి కె.మోహన్ బుధవారం వెలువరించారు. గణపతి, బాలాజీలకు తలా మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా కూడా విధించారు.

పడవ నుంచి జారి పడిన జాలరి మృతి

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణంబాక్కం ప్రాంతంలోని సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఓ జాలరి పడవలో నుంచి జారిపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంబాక్కం శ్రీనివాసపురానికి చెందిన కుమరన్ (37) మంగళవారం సాయంత్రం తన పదేళ్ల కుమారుడు సంజయ్‌తో కలసి నాటు పడవలో పట్టణంబాక్కం ముఖద్వారంలో చేపల వేటకు వెళ్లాడు. ఆయనకు హఠాత్తుగా మూర్ఛ రావడంతో సముద్రపు నీటిలో జారిపడ్డాడు. ఆయన కుమారుడి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న జాలర్లు వెంటనే వెళ్లి సంజయ్‌ను తమ పడవలో ఎక్కించుకున్నారు. అనంతరం నీటమునిగిన కుమరన్ కోసం దాదాపు గంటన్నరపాటు గాలించినా జాడ తెలియలేదు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కుమరన్ మృతదేహం తీరానికి కొట్టుకురావడంతో పోలీసులు స్వాధీనం చేసుకొని రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కీల్పాక్కం వైద్యకళాశాలలో ర్యాగింగ్

డీఎస్పీ కుమారుడి సహా ఇద్దరిపై కేసు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కీల్పాక్కం ప్రభుత్వ వైద్య కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థిపై ర్యాగింగ్ పేరుతో దాడికి పాల్పడిన డీఎస్పీ కుమారుడు సహా ఇద్దరిపై పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కళాశాల ప్రాంగణంలోని హాస్టల్‌లో ఉంటూ చదువుతున్న ఆలన్‌క్రైసా అనే థర్డ్ ఇయర్ విద్యార్థిని ఈ నెల 24వ తేది సీనియర్ విదార్థులు కవిన్, జ్ఞానేష్ బీర్ బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధిత విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆ విద్యార్థులిద్దర్నీ సస్పెండ్ చేస్తూ కళాశాల యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, జ్ఞానేష్ డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న డీఎస్పీ కుమారుడని తెలిసింది.

అంబత్తూరులో నకిలీ వైద్యుడి అరెస్టు

అడయార్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూరులో నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. కొళత్తూరు లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన గుహనాథన్ (42) అంబత్తూరు షణ్ముగపురంలో బాలాజీ పేరుతో క్లినిక్ నడుపుతున్నాడు. ఈయన వద్దకు అనేక మంది స్థానికులు వచ్చి చికిత్స చేయించుకుంటారు. ఈ క్రమంలో ఆయన నకిలీ డాక్టరని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగప్రవేశం చేసిన ఆరోగ్యం సంక్షేమ విభాగం జాయింట్ డైరెక్టర్ ఇళంగోవన్, డీఎస్పీ సీతారామన్ సహా మరో నలుగురు అధికారులు కలిసి ఆ క్లినిక్‌లో తనిఖీలు చేశారు. ఇందులో గుహనాథన్ ఎంబీబీఎస్ పూర్తి చేయకుండానే వైద్యం చేస్తున్నట్టు గుర్తించి, అరెస్టు చేశారు.

తిరుచెందూరులో రెండో రోజూ వెనక్కి మళ్ళిన సముద్రం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరులో అమావాస్య, పౌర్ణమి దినాలు సమీపించే రోజుల్లో సముద్రం వెనక్కి వెళ్లడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం శుక్రవారం అమావాస్య రానుండటంతో మంగళవారం ఉదయం అక్కడి సముద్రతీరం సుమారు వందడుగుల మేర వెనక్కి మళ్ళింది. దీంతో తీరమంతా నాచుతో ఉన్న బండరాళ్లు బయటపడ్డాయి. సాయంత్రానికి మళ్లీ ఆ సముద్రతీరం యథాస్థితికి చేరింది. ఇదే విధంగా బుధవారం ఉదయం కూడా తిరుచెందూరు సముద్రతీరం సుమారు 50 అడుగుల దాకా వెనక్కి మళ్లింది. అదే సమయంలో రెండు ముళ్ల పందులు తీరం వైపు కొట్టుకు వచ్చాయి. ఇలా సముద్రం వెనక్కి మళ్లుతున్నా పట్టించుకోకుండా తిరుచెందూరు ఆలయాన్ని దర్శించేందుకు వచ్చే భక్తులు సముద్రంలో స్నానమాచరిస్తున్నారు.

రూ.115 కోట్ల ఆవిన్ స్వీట్ల విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రూ.115 కోట్ల స్వీటు, కారం రకాలు విక్రయించినట్లు ఆవిన్ సంస్థ తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థ దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక స్వీట్లు, కారం రకాలు విక్రయాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం వరకు రూ.115 కోట్ల స్వీట్ల విక్రయాలు జరిగాయని, గత ఏడాదితో పోల్చితే రూ.10 కోట్లు అధికమని, బుధ, గురువారాల్లో విక్రయాలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

నెల రోజుల్లో గెస్ట్‌హౌస్‌ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా వ్యాప్తంగా ఉన్న అనాథాశ్రమాలు, అతిథి గృహాలను నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఆదేశించారు. ఇదే విషయంపై కలెక్టర్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. చెన్నై జిల్లాలోని చిల్డ్రన్ హోమ్స్, అనాథాశ్రమాలు, మానసిక దివ్యాంగుల కేంద్రాలు, దివ్యాంగుల సంక్షేమ కేంద్రాలు, డీఅడిక్షన్ రిలీజ్ కేంద్రాలు, మహిళలు, బాలల సంక్షేమ కేంద్రాలు, అనాథాశ్రమాలను నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ గృహాలను నడిపే యజమానులు తమ పూర్తి వివరాలను సమర్పించి నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం మూడు చిత్రాలు విడుదలకానున్నాయి. వీటిలో ఒకటి శివకార్తికేయన్ - సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్', జయం రవి - ప్రియాంకా మోహన్ కలిసి నటించిన 'బ్రదర్', యువ హీరో కవిన్ ప్రధాన పాత్ర పోషించిన 'బ్లడీ బెగ్గర్' మూవీలున్నాయి. గత యేడాది కార్తీ నటించిన 'జపాన్', రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య నటించిన 'జిగర్‌తండా డబుల్ ఎక్స్' చిత్రాలు వచ్చాయి. ఏ ఒక్క పెద్ద హీరో చిత్రం విడుదలకాలేదు. ఈ యేడాది కూడా అదేపరిస్థితి నెలకొంది. అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్, అజిత్ కుమార్, ధనుష్, సూర్య, కార్తీ వంటి వారు నటించిన చిత్రాలు ఒక్కటి కూడా విడుదలకావడం లేదు. ఈ నేపథ్యంలో నేడు విడుదలవుతున్న మూడు చిత్రాల వివరాలను సంక్షిప్తంగా పరిశీలిస్తే...

దీపావళి విజేత ఎవరో?



● నేడు మూడు చిత్రాలు విడుదల



అమరన్...

కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన కేరళ రాష్ట్రానికి చెందిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని అగ్రనటుడు కమల్ హాసన్ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్నట్టు ప్రకటించినప్పటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో లైవ్ లొకేషన్లలో ఈ చిత్రాన్ని ఇండియన్ ఆర్మీ అనుమతితో చిత్రీకరించారు. ఇప్పటికే ఈ సినిమా చూసిన ఆర్మీ అధికారులు చిత్ర బృందాన్ని ప్రశంసల వర్షంలో ముంచెత్తడంతో చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, లిరికల్ సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చింది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సినిమాను మరో స్థాయిలో నిలబెట్టిందంటూ ప్రచారం సాగుతోంది. శివకార్తికేయన్ నటించిన చిత్రం దీపావళికి విడుదలకావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

చిత్రజ్యోతి

బ్రదర్...

'శివ మనసుల శక్తి', 'బాస్ ఎన్‌గిర భాస్కరన్, 'ఒరు కల్ ఒరు కన్నాడి' వంటి చిత్రాలతో వరుస హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న ఎం.రాజేష్... ఆ తర్వాత తెరకెక్కించిన ఐదు చిత్రాలు వరుస పరాజయాలను చవిచూశాయి. దీంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును దర్శకుడు రాజేష్ చేపట్టారు. ఈయన తొలిసారి అక్కా - తమ్ముడు సెంటిమెంట్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. ఇప్పటికే ఈ చిత్ర ఆడియోకు శ్రోతల నుంచి మంచి స్పందన లభించింది. అలాగే, దాదాపు 12 యేళ్ళ తర్వాత రాజేష - హ్యారీస్ జయరాజ్ పని చేసిన చిత్రం కావడం గమనార్హం. పైగా హారీస్ జయరాజ్‌కు ఈ సినిమా కమ్‌బ్యాక్ మూవీగా ఉంటుందని భావిస్తున్నారు.



'బ్రదర్'లో ప్రియాంకా, జయం రవి



బ్లడీ బెగ్గర్...

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో 'జైలర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తొలిసారి నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని నిర్మించారు. తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివబాలన్‌కు దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు. టీవీ సీరియల్స్‌లో నటిస్తూ బిగ్‌బాస్ హౌస్‌లో అడుగుపెట్టి మంచి ఫాన్స్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న కవిన్ హీరోగా నటించారు. నిర్మాత నెల్సన్ స్నేహితుడు కూడా. ఈ యేడాది కవిన్ నటించిన 'డాడా' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇపుడు తొలిసారి దీపావళికి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

సందేశం ద్వారా ప్రాణాలు కాపాడే
'మెసెంజర్'

పీవీకే ఫిలిమ్స్ ఫ్యాక్టరీ బ్యానరుపై బి.విజయన్ నిర్మించిన తాజా చిత్రం 'మెసెంజర్'. శ్రీరామ్ కార్తీక్ ప్రధాన పాత్ర పోషించగా, మనీషా జష్నానీ, ఫాతిమా నహీం, వైశాలి రవిచంద్రన్ హీరోయిన్‌లుగా నటించారు. లివింగ్‌స్టన్, ప్రియదర్శిని రాజ్ కుమార్, జీవ రవి, యమున, కోదండన్, ఇట్స్ ప్రశాత్, కూల్ సురేష్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రమేష్ ఇలంగామణి. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ 'ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్న హీరో ప్రేమ వైఫల్యంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడతాడు. ఆ సమయంలో ఓ మహిళ అతని ఫేస్‌బుక్ మెసెంజర్‌కు ఓ సందేశాన్ని పంపించి ఆ ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకుంటుంది. అయితే, ఆత్మహత్యకు పాల్పడబోతున్నాడే విషయం ఎలా తెలిసిందని ఆ మహిళకు హీరో మెసేజ్ ద్వారా అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు. అప్పటికే చనిపోయిన ఒక వ్యక్తి తన ప్రాణాలను కాపాడినట్టుగానే నీ ప్రాణాలను కూడా కాపాడినట్టు చెబుతుంది. ఇంతకీ ఆ మహిళ ఎవరో కనుగొనేందుకు హీరో చేసే ప్రయత్నమే ఈ కథ. ఇది ఒక ఫాంటసీ లవ్ స్టోరీ. చెన్నై, విల్లుపురం జిల్లా విక్రవాండి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. త్వరలోనే టీజర్, ట్రైలర్ రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



'మెసెంజర్'లో ఓ దృశ్యం

ప్రియుడిని పరిచయం చేసిన కోలీవుడ్ హీరోయిన్

కోలీవుడ్‌కు చెందిన హీరోయిన్ రవీనా తన ప్రియుడుని పరిచయం చేసింది. ఆయనతో కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. పైగా త్వరలోనే ప్రియుడిని పెళ్ళాడనున్నట్టు సూచనప్రాయంగా వెల్లడించారు. కోలీవుడ్‌లో డబ్బింగ్ కళాకారిణిగా కెరీర్ ప్రారంభించిన రవీనా... ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి నటించిన 'లవ్‌టుడే' చిత్రంలో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. రవీనా తల్లి శ్రీజ కూడా సౌత్ ఇండియన్ మూవీ ఇండస్ట్రీలో ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్టుగా కొనసాగుతున్నారు. అయితే, 'వాలాట్టి' అనే మలయాళ చిత్రానికి దర్శకత్వం వహించిన దేవన్ జయకుమార్‌ను రవీనా ప్రేమించారు. ఈ చిత్రానికి డబ్బింగ్ చెప్పే సమయంలో వీరిద్దరు ప్రేమలో పడ్డారు. ఈ విషయాన్ని తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో ఫోటో షేర్ చేసి బహిర్గతం చేశారు. వీరిద్దరికి సినీ ప్రముఖులు ముందస్తు శుభాకాంక్షలు చెబుతున్నారు.



ప్రియుడితో రవీనా

చీర కట్టడంలో మెలకువలపై అవగాహన

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు చీర కట్టడంలో ఉండే మెళకువలపై ప్రఖ్యాత నిపుణురాలు డాలీ జైన్ 'ది ఆర్ట్ ఆఫ్ శారీ డ్రేపింగ్ : బ్లెండింగ్ ట్రెడిషన్ అండ్ క్రియేటివిటీ' పేరుతో ఒక అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఓ నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎఫ్ఎల్‌వో చెన్నై సంయుక్త కార్యదర్శి, ప్రముఖ చేనేత హస్తకళా నిపుణురాలు అమూల్యరావు అట్లూరి సమన్వయం చేశారు. ఇందులో చీర కట్టడంలో నైపుణ్యం, మెళకువలను వివరించారు. సుమారు 400 మందికిపైగా మహిళా ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దాదాపు 355కి పైగా డ్రెస్సింగ్ స్టైల్స్ క్రియేట్ చేయడంలో మంచి ప్రావీణ్యం కలిగిన జాలీ జైన్... చీర కట్టడంలోని మెళకులను వివరించారు.



కార్యక్రమంలో ప్రముఖులు

ఊటీలో విరబూసిన అజిలాయా పుష్పాలు



అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలోని బొటానికల్ గార్డెన్‌లో అజిలియా పుష్పాలు విరబూశాయి. ఈ పుష్పాలు యేడాదిలో అక్టోబరు నుంచి డిసెంబరు వరకు మాత్రమే పుష్పిస్తాయి. అక్టోబరు నెలాఖరు నాటికి ఈ పుష్పాలు వికసించి గార్డెన్‌కే ప్రత్యేక అందం తెస్తాయి. ఈ పార్కు అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులు ఈ పుష్పాల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆకర్షించే రంగుల్లో రామ్‌రాజ్ పంచెలు

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో సంప్రదాయ దుస్తుల విక్రయంలో నెంబర్ వన్‌గా ఉన్న రామ్‌రాజ్ కాటన్ కొత్తగా టిష్యూ ధోతీ కలెక్షన్ పేరుతో పంచెలను ఆవిష్కరించింది. సమకాలీన శైలిని మిళితం చేస్తూ మొత్తం ఏడు ఆకర్షణీయమైన రంగుల్లో వీటిని పరిచయం చేసింది. ఎంతో తేలికగా, చూడ చక్కగా ఉండేలా వీటిని తయారు చేశారు. ఆకర్షణీయమైన రంగులైన గోల్డెన్ బార్డర్, క్లాసిక్ వైట్, రామ గ్రీన్, గోల్డ్, రోజ్ గోల్డ్, లావెండర్, సియాన్, మాస్ గ్రీన్, సిల్వర్, స్టీల్ గ్రే వంటి వైబ్రెంట్ రంగులతో దీపావళి పండుగను పురస్కరించుకుని విక్రయానికి సిద్ధంగా ఉంచింది. సాంప్రదాయ హస్తకళపట్ల ఉండే అంకితభావం నేటి ఫ్యాషన్ ల్యాండ్‌స్కేప్‌లో, మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ పంచెలను తీర్చిదిద్దినట్టు రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్ వెల్లడించారు. పురుషులతో పాటు పిల్లలకు కూడా ఈ టిష్యూ ధోతీలను పరిచయం చేయగా, డిమాండ్ అద్భుతంగా ఉందన్నారు.



నూతన ధోతీలను ఆవిష్కరిస్తున్న కేఆర్ నాగరాజన్

తిరువాన్మియూరులో కేవీబీ శాఖ ప్రారంభం



కేవీబీ శాఖను ప్రారంభిస్తున్న టి.ఆనంద్ తదితరులు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కరూర్ వైశ్యాబ్యాంక్ నూతన శాఖను తిరువాన్మియూరు వాల్మీకి వీధిలో ఏర్పాటు చేశారు. దీనిని రాష్ట్ర ఆదిద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శి టి.ఆనంద్ ఇటీవల ప్రారంభించారు. అదే విధంగా ఈ నెల 28వ తేదీ కన్నియకుమారి జిల్లా ఎరేనియల్‌లో, తిరుప్పూర్ జిల్లా మంగళంలో, బెంగళూరులోని కేఆర్ పురంలోనూ నూతన శాఖల్ని ప్రారంభించిన కరూర్ వైశ్యా బ్యాంక్ ఇప్పటి వరకూ మొత్తం 848 శాఖలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజైన గురువారం దీపావళి పండుగ జరుపుకొనేందుకు రాష్ట్రం ప్రత్యేక హంగులతో సిద్ధమైంది. వివిధ ఆకృతుల్లో తయారుచేసిన ప్రమిదలను గృహిణులు కొనుగోలు చేసి తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. అదేవిధంగా దీపావళి టపాసులు, పూజా ద్రవ్యాల కొనుగోలు సందడి నగరంతో పాటు మిగతా జిల్లాల్లో కూడా కనిపించింది. అదే విధంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో సొంతూళ్లకు వెళ్లేవారితో రద్దీ నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి, ప్యారీస్)





ఆభరణాల కొనుగోలులో మహిళలు - టపాసులు కొనుగోళ్లలో ప్రజలు





స్థానిక టి.నగర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ - స్థానిక కిలంబాక్కం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

జీసీసీ పీఛేముడ్

- క్రీడా మైదానాల ప్రైవేటుపరంపై వెనకడుగు
- నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న కార్పొరేషన్
- సర్వత్రా వ్యతిరేకత రావడంతో నిర్ణయం

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో ఉన్న తొమ్మిది ఫుట్‌బాల్ క్రీడా మైదానాల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న నిర్ణయంపై గ్రేటర్ కార్పొరేషన్ వెనక్కి తగ్గింది. క్రీడాకారులు, రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి వచ్చిన విమర్శల నేపథ్యంలో బుధవారం మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఒక తీర్మానం చేసి, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. చెన్నై నగర పాలక సంస్థ నెలవారీ సమావేశం బుధవారం మేయర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో డిప్యూటీ మేయర్‌తో పాటు నగర కమిషనర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇందులో మొత్తం 79 తీర్మానాలను చేసిన ఏకగ్రీవంగా ఆమోదించారు. వీటిలో అతి ముఖ్యమైన తీర్మానమైన ఫుట్‌బాల్ క్రీడా మైదానాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరిస్తూ చేసిన తీర్మానం కూడా ఉంది. ఈ తొమ్మిది క్రీడా మైదానాలు ముల్లై నగర్, వ్యాసార్పాడి, నేవల్ హాస్పిటల్ సాలైలో ఉన్న స్టేడియం, తిరువిక నగర్‌లోని క్రీడా మైదానం, రంగసాయి క్రీడా మైదానం, కేబీ పార్కు ఆటస్థలం, మేయర్ సత్యమూర్తి సాలై క్రీడా మైదానం, అమ్మా మాలిగై కోడంబాక్కం ప్రధాన రోడ్డు, కామకోటి నగర్ ఆరో వీధిలో ఉన్న మైదానం, చోళింగనల్లూరులోని క్రీడా మైదానాలున్నాయి. ఈ క్రీడా మైదానాల ప్రైవేటీకరణ చేస్తూ, ఒక గంటకు రూ.120 చొప్పున రుసుం వసూలు చేయాలని నిర్ణయించారు. గతంలో తీసుకున్న ఈ నిర్ణయంపై అన్నాడీఎంకే, లెఫ్ట్ పార్టీలతో పాటు పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే, కార్పొరేషన్ చేసిన ప్రకటనపై ఫుట్‌బాల్ క్రీడాకారులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వ్యతిరేకించారు. దీంతో తాజాగా జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఇదిలా వుండగా 31వ తేదీన జాతీయ సమైక్యతా దినాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేయించాల్సివుండగా, గురువారం సెలవుదినం కావడంతో బుధవారమే మేయర్ కార్పొరేషన్ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు.



కార్పొరేషన్ ఉద్యోగుల చేత జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ ప్రియ

దుబాయ్ కార్ రేస్ పోటీల్లో అజిత్

- తమిళనాడు క్రీడా లోగో

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లోని ఆటోడ్రామ్ రేస్ ట్రాక్‌లో పోర్షే జీటీ3 కప్ కార్ రేస్ ట్రయల్ పోటీల్లో అగ్రహీరో అజిత్ కుమార్ పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్ర క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన లోగోతో ఆయన ఈ ట్రయల్ రన్‌లో పాలుపంచుకున్నారు. దుబాయ్ కేంద్రంగా జరిగే ఆటోడ్రోమ్ కార్ రేస్ పోటీలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయి. ఈ రేస్ ప్రధాన పోటీలకు ముందు నిర్వహించిన ట్రయల్ రన్‌లో అజిత్ పాల్గొని 350 కిలోమీటర్ల వేగంతో కారు నడిపారు. ఆ సమయంలో అజిత్ తన కారు పైన, క్రీడా పరికరాలపై తమిళనాడు క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన లోగో ఉపయోగించడంతో ప్రతి ఒక్కరూ ఆయనను అభినందిస్తున్నారు.

అజిత్‌కు ఉదయనిధి విషెస్..

అంతర్జాతీయ క్రీడా వేదికపై తమిళనాడు రాష్ట్ర క్రీడా మంత్రిత్వ శాఖకు మరింత గౌరవ ప్రతిష్ఠలు చేకూర్చేలా అజిత్ క్రీడా లోగోను ఉపయోగించారని రాష్ట్ర క్రీడా మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదనిధి పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఒక ప్రటకన విడుదల చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వ పాలన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలిపేలా కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా రాజధాని చెన్నై నగరంలో ఫార్ములా 4 చెన్నై రేసింగ్ స్ట్రీట్ సర్క్యూట్ పేరుతో కార్ల పోటీని నిర్వహించగా, హీరో అజిత్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారని గుర్తు చేశారు. ఇపుడు రాష్ట్ర క్రీడా రంగానికి మరింత వన్నె తెచ్చేలా ఆయన దుబాయ్ కార్ రేస్ ట్రయల్ రన్‌లో పాల్గొని, క్రీడా మంత్రిత్వ శాఖ లోగో ఉపయోగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



తమిళనాడు క్రీడా లోగోతో అజిత్

2న ఆస్ట్రేలియాకు స్పీకర్ అప్పావు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావు నవంబరు 2న ఆస్ట్రేలియా పర్యటనకు వెళతారని సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఆస్ట్రేలియా దేశ రాజధాని సిడ్నీలో నవంబరు 5 నుంచి 8వ తేది వరకు 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ మహానాడు జరుగనుంది. ఈ మహానాడుకు స్పీకర్ అప్పావు హాజరుకానున్నారు. ఇందుకోసం ఆయన 2వ తేది శనివారం రాత్రి 11.25 గంటలకు సింగపూర్ చేరుకొని, అక్కడి నుంచి మలేసియాకు వెళతారు. మలేసియా నుంచి సిడ్నీ నగరానికి 5వ తేది చేరుకుంటారు. మహానాడులో పాల్గొన్న అనంతరం స్పీకర్ న్యూజిలాండ్ వెళ్లి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, 17న నగరానికి తిరిగొస్తారు.

పరోపకారాన్ని చాటిచెప్పేదే సనాతన ధర్మం

- శృంగేరి విధుశేఖర భారతిస్వామి



చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పరులకు ఉపకారం చేయాలంటూ మానవాళికి సన్మార్గాన్ని బోధించేదే సనాతన ధర్మమని శృంగేరి శారదా పీఠం సన్నిధానం విదుశేఖర భారతిస్వామి అన్నారు. విజయయాత్రలో భాగంగా ఆ స్వామి నగరానికి విచ్చేశారు. కోడంబాక్కంలోని మీనాక్షి కళాశాలలో శృంగేరి శారదాపీఠం శంకరాచార్యులు జగద్గురు భారతి తీర్థస్వామి సన్న్యాస దీక్ష స్వీకరించిన పంచ దశవార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ ఆదిశంకరులు నెలకొల్పిన నాలుగు మఠాల్లో సన్న్యాసులే పీఠాధిపతులుగా ఉండాలని ఆదేశించారని, పీఠాధిపతులకు ఎవరిపై రాగద్వేషాలు ఉండకూడదని, అప్పుడే వారు ధర్మ ప్రచార బాధ్యతలను చక్కగా నిర్వర్తించగలుగుతారన్నారు. మహాసన్నిధానం సన్యాసదీక్ష స్వర్ణోత్సవాల్లో మత సామరస్యతను పెంపొందింపజేయాల్సిన బాధ్యతలు తమవంటివారిపై ఉన్నాయని స్వామి అన్నారు.



బుధవారం రాజ్‌భవన్‌లో పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి



నందనం కూడలి వద్ద పసుంపొన్ ముత్తురామలింగ్ దేవర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రమంత్రులు, మేయర్ తదితరులు



మదురై గోరిపాళయం వద్ద దేవర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్టాలిన్



చెన్నై ఆళ్వార్‌పేటలోని తమిళ మానిల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకొని ఆ పార్టీ అధ్యక్షులు జీకే వాసన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ నేతలు జీఆర్ వెంకటేష్, కల్యాణి, శక్తివడివేల్ తదితరులు



చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ


ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

అపురూపాలు ఆదిమానవుడి రేఖాచిత్రాలు



25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్లు ● చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి
రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు ● రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు

ముద్దనూరు,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమానవుడి రేఖా చిత్రాలు కడప జిల్లా ముద్దనూరు మండలం చింతకుంట కొండలో కనువిందు చేస్తున్నాయి. 25 వేల ఏళ్ల కిందట ఇక్కడ మానవులు ఆవాసం ఏర్పరచుకున్నారని, జీవించారని, కొండపై చిత్రించిన రేఖా చిత్రాలు ఆధారభూతమై నిలుస్తున్నాయి. ఇక్కడి వాతావరణం, నీరు, ఆహారం పుష్కలంగా ఉండడంతో ఆదిమానవుడు ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని నివసించి ఉంటారని దాదాపు 200 రేఖాచిత్రాలను తిలకించిన మేధావులు అభిప్రాయపడుతున్నారు. వీరు ఏర్పాటు చేసుకున్న నివాస ప్రదేశాల ఆచూకీ తెలుసుకునేందుకు అనువుగా అక్కడక్కడా ఎరుపు రంగు ఆకుపసరుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆదిమానవడు దాదాపు 12 అడుగుల ఎత్తు ఉండవచ్చని, కొండలో ఇంకా గాలిస్తే ఎన్నో ఆనవాళ్ల లభించే అవకాశం వుందని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆదిమానవుడి ఆనవాళ్లు మరెన్నో గుర్తించవచ్చు. నాటి చరిత్ర, నేటి యువతరానికి ప్రతీకలు, శతాబ్దాలు దాటిన ప్రతి ఆనవాళ్లు చరిత్రకు ప్రతీకగా, అపురూపంగా భావించి, వాటి అభి వృద్ధి, రక్షణ కోసం పర్యాటక, పురావస్తు శాఖలను ఏర్పాటు చేశారు. కోతి ద్వారా ఆదిమానవుడు రూపాంతరం చెందుతూ నేడు మనిషిగా మనుగడ కొనసాగిస్తున్నాడు. అటువంటి ఎంతో పురాతన చరిత్ర కలిగిన 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్న రేఖాచిత్రాలను, తిలకించేందుకు వచ్చే సందర్శకులకు చింతకుంట కొండలో రక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి.

చింతకుంట పంచాయతీలోని కొండలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కొండపై నెలకొన్న కోనలింగేశ్వరస్వామి(శివాలయం), సమీపంలోనే 1909 బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన విశాలమైన జలాశయాన్ని తలపిస్తున్న చింతకుంట చెరువు. ఈప్రదేశంలో నెలకొన్న ప్రతి ఒక్కటీ చరిత్రను సృష్టిస్తున్నాయి. 2010 ఆగస్టు 17న అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్, వివేకవర్థిని జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, కడప ఇన్‌టాక్ లైఫ్‌మెంబర్, అప్పటి జిల్లా కన్వీనర్ సీతారామయ్య, అప్పటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి సత్యం కొందరు పత్రికా విలేకరుల సహకారంతో ఆది మానవుడి ఆనవాళ్ల కోసం కొండలో గాలించి ఆదిమానవుడి రేఖాచిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఎద్దుల ఆవులగుండు, గొడుగుగుండు, చిన్నావిడగుండు, పెద్దావిడ గుండు, మారెమ్మగుండు, గనంగుండు, మబ్బుగుండు, చిలకలోల్లగుండు ఇంకా ఎన్నో గుండ్ల పై ఆదిమానవుడు నాటి నాగరికత, పనిముట్లు, జంతువుల రేఖాచిత్రాలను కొండరాళ్లకు ఆకుపసరుతో నేటి యుగానికి కనువిందు చేసేలా చిత్రించాడు. ఏనుగు, జింక, దుప్పి, నక్క, కుందేలు, పక్షులు, ఎద్దు, విల్లంబులు ఎక్కుపెట్టిన మానవాకృతులు, అప్పటి వేటకు ఉపయోగించే పనిముట్లు, లైంగిక చిత్రాలు, దాదాపు 200 రేఖాచిత్రాలు కనిపిస్తాయి. ఈరేఖాచిత్రాలను తిలకించిన మేధావులు ఆది మానవుడు నివాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని ఆవాసం ఏర్పరచుకుని ఉంటారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆదిమానవులు ఎక్కువ సంఖ్యలో ఉండి వుంటారని తెలుస్తోంది. అంతే కాకుండా ఇక్కడ వారి నివాసాలను గుర్తించేందుకు అనువుగా ఎరుపు రంగుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా వారు మరణిస్తే మృతదేహం పట్టేలా రాతి గుండును మలిచి మృతదేహాన్ని దానిలో పడుకోబెట్టి సీసంతో నింపి అంత్యక్రియలు చేసేవారని వివరిస్తున్నారు. ఈప్రదేశంలో అటువంటి శ్మశానవాటిక ఉండవచ్చని వెదికితే గుర్తించవచ్చని అంటున్నారు. కొండలో గాలిస్తే మరెన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని, ఇటువంటి వాటిని గుర్తించి వాటిని భద్రపరిస్తే చరిత్రకు ఆన వాళ్లుగా నిలుస్తాయని అంటున్నారు. రేఖాచిత్రాలు వెలుగు చూసిన తరువాత ఈ ప్రదేశాన్ని ఎందరో సందర్శనార్థం వస్తున్నారు. కొండపైకి వెళ్లాలంటే దారి సరిగాలేకపోవడంతో 2010లో ఉపాధి పథకంలో భాగంగా పర్యాటకుల కోసం అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్ గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేయించారు. 2010 ఆగస్టు24న అప్పటి డీపీఆర్ఓ ప్రసాద్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు సాంబశివారెడ్డి, రామబ్రహ్మం విద్యార్థులతో కలిసి సందర్శించారు. తరువాత 2011 ఫిబ్రవరి19న అప్పటి డీపీఆర్ఓ గోపాల కొండలోని అన్ని గుండ్లకు ఉన్న రేఖా చిత్రాలను సందర్శించారు. అప్పట్లో జమ్మలమడుగు న్యాయమూర్తి, న్యాయవాదులు, ఆర్టీపీపీ ఉద్యోగులు రేఖాచిత్రాలను సందర్శించారు. మనరాష్ట్రం విద్యార్థులే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి విద్యార్థులు సందర్శనార్థం వస్తూనే వున్నారు. ఆతర్వాత 6వతరగతి సాంఘిక శాస్త్రంలో ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు పాఠ్యాంశంలో రచయిత, ప్రస్తుతం సంబేపల్లె హెచ్ఎం మడితాటి నరసింహారెడ్డి పొందుపరిచారు. దీంతో ఈ ప్రదేశంపై రాష్ట్ర విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఆదిమానవుడి రేఖాచిత్రాలకు పర్యాటక, పురావస్తు శాఖ వారు రక్షణ కల్పించలేకపోతున్నారు. అప్పట్లో సందర్శనార్థం వచ్చిన కడప అక్షర పాఠశాల విద్యార్థులపై తేనెటీగల దాడి చేశాయి. అయినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సందర్శకులకు రక్షణ కల్పించవలసిన అవసరం ఎంతైనా వుంది.


రేఖాచిత్రాల అన్వేషణ కోసం మొదటగా వెళుతున్న ఇన్‌టాక్ సభ్యులు, యోగివేమన ప్రొఫెసర్లు,పర్యాటకశాఖ, అధికారులు, ఎంపీడీఓ - గొడుగు గుండు - మబ్బు గుండులో అప్పటి డీఆర్‌డీఏ పీడీ, పర్యాటకశాఖ గోపాల్, ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్

ప్రజల నుంచి వినతుల స్వీకరణ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. నగర ప్రజలు సమస్యలు తెలుసుకొనేలా ప్రతిరోజు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్ ప్రకటించారు. ఆ ప్రకారం, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజలు నుంచి 20 వినతులు స్వీకరించారు. ఈ సమస్యలపై విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఎందుకిలా?

● చుక్క నీరు పడ్డా మదురై జలమయమే!
● సీఎంతో అధికారుల సమీక్ష
● రూ.11.9 కోట్లతో సెల్లూరు సిమెంట్ కాలువ నిర్మాణం

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చుక్క నీరు పడినా చెన్నై చెరువులా మారడం చూస్తున్నాం. అయితే ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన మదురై కూడా ఇదే తరహాలో తయారవుతోంది. ఎందుకిలా జరుగుతోందంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులను ప్రశ్నించారు. మదురై నగరంలో ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి బుధవారం మధ్యాహ్నం అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. రామనాథపురం జిల్లా పసుంపొన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తురామలింగ దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించిన తర్వాత ఆయన మదురై చేరుకుని అధికారులతో సమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రులు పి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. మదురైలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎక్కువగా దెబ్బతిన్న సెల్లూరు ప్రాంతంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఇకపై ఆ ప్రాంతంలో వరద పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే 290 మీటర్ల పొడవునా సెల్లూరు కాలువ సిమెంట్ కాలువగా మార్చాలన్నారు. వెంటనే సీఎం స్టాలిన్ రూ.11.9కోట్లతో సిమెంట్ కాలువను నిర్మించాలని ఆదేశించారు.


మదురైలో పునరావాస కార్యక్రమాలు చేపట్టే విషయమై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కావేరి వైగై కుండారు అనుసంధాన పథకం..
అంతకు ముందు స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ ఆరుదశాబ్దాలుగా కావేరి వైగై కుడారు అనుసంధాన పథకం అమలుకాకపోవడం శోచనీయమన్నారు. 2008లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రభుత్వ హయాంలో ఈ పథకం అమలు కోసం ప్రాథమిక స్థాయి పనులు కూడా ప్రారంభించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే పాలకులు ఆ పథకాన్ని బుట్టదాఖలు చేశారని విమర్శించారు.



కడప గాన కోకిల మహతి

● కడప కళాతోరణంలో మరో ఆణిముత్యం
● లగ్గం సినిమాలో రెండు పాటలు పాడిన గాయని


లగ్గం చిత్రంలో పాటలు పాడిన మహతిని అభినందిస్తున్న హీరో సుమన్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప కళాతోరణంలో ఆ యువతి మరో ఆణిముత్యం. తన గాన మాధుర్యంతో అంచెలంచెలుగా ఎదుగుతూ లగ్గం సినిమాలో రెండు పాటలు పాడి అలరించారు. ఆ ఛాన్స్ కొట్టింది మరెవరో కాదు.. కడప నగరం మోచంపేటకు చెందిన మాజీ కార్పొరేటరు సురేశ్‌బాబు, సౌజన్య కుమార్తె.. మహతి. 20 ఏళ్ల ఆ యువతికి పాటలంటే ప్రాణం. చిన్ననాటి నుంచి శాస్త్రీయ సంగీతంపై మక్కువ ఎక్కువ. బుల్లితెర పోటీల్లోనూ పాల్గొని తన సత్తా చాటుకున్నారు. తన కుమార్తె మక్కువను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు గురువు నంద్యాల లలిత చెంత శిక్షణ ఇప్పించారు. ఆమె శిష్యరికంలో ఎన్నో సంగీత మెళకువలు నేర్చుకున్నారు. అనేక సంగీత పోటీల్లో విజేతగా నిలిచారు. కొన్ని సినిమాలకు ఆమె సినీ దర్శకుల సూచనల మేరకు ట్రాక్‌లు పాడారు. ఇటీవల సుబ్బిసి ఎంటర్‌ప్రైజెస్ నిర్మిస్తున్న లగ్గం సినిమాలో ఆమెకు రెండు పాటలు పాడే అవకాశం లభించింది. ఒక పాట యుగళగీతం కాగా.. మరొకటి సహగాయనితో కలిసి పాడారు. ఈ సినిమాకు శంకర్ అర్జున్ సంగీతం అందించగా.. రమేశ్ చెప్పల దర్శకత్వం వహించారు. లగ్గం సినిమా ఈ నెల 25న విడుదల అయింది.

ఆరేళ్లప్రాయం నుంచి గానంపై మక్కువతో మహతి పాటలు పాడడం ప్రారంభించారు. అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా వేదికలపై గాత్ర కచేరి పోటీల్లో పాల్గొంది. దాదాపు 50కి పైగా గాన పోటీల్లో బహుమతులు అందుకున్నారు.

● 2009లో రాజంపేట స్వరాంజలి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు.
● 2009-10 శ్రీవాణి అర్జున్ నిర్వహించిన అన్నమయ్య త్యాగరాజ సంగీతోత్సవాల్లో ప్రథమ బహుమతి.
● 2009 కడప అహోబిళం మఠం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి.
● 2010లో రాజంపేట కళాంజలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి.
● 2010- 11లో కడప ఆర్తిహోంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ, ప్రథమ బహుమతులు పొందారు.
● 2011లో ఈటీవీ నిర్వహించిన లిటిల్‌ఛాంప్స్‌లో పాల్గొన్నారు. పాడుతా తీయగా కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.


గాయని పి.సుశీలతో మహతి
మనోతో..
లిటిల్‌ఛాంప్స్ కార్యక్రమంలో ఎస్పీ శైలజతో

కీర్తనలంటే ప్రాణం
దేవదేవభజం, ఆరగించి కూర్చున్న నల్లవాడే, ఏ తీరుగనను దయచూచెదవో తదితర అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు, సినిమాల్లో భక్తిరస పాటలంటే మహతికి చాలా ఇష్టం.

విద్యాభ్యాసం
మహతి పాఠశాల విద్యను కడప విద్యామందిర్‌లో పూర్తి చేశారు. ఇంటర్ ఓపెన్ స్కూలులో చదివి బీబీఏ డిగ్రీని విజ్ఞాన్ కళాశాలలో పూర్తి చేశారు. ప్రస్తుతం తిరుపతి పద్మావతి యూనివర్శిటీలో సంగీతంలో ఎంఏ కోర్సును చదువుతున్నారు.